
సాక్షి నిర్మల్

ఆదివారం • 6 • ఏప్రిల్ • 2025



విద్యుత్ దీపాల ఏర్పాటు 8లో▸

'భక్తుల భద్రత గాలిలో దీపమే' శీర్షికన 'సాక్షి'లో శనివారం ప్రచురితమైన కథనానికి బానర గ్రామ పంచాయతీ ఈవో ప్రసాద్‌గౌడ్ స్పందించారు.వీధి దీపాలు ఏర్పాటు చేశారు.



సెలవు చావుకొచ్చింది! 8లో▸

సెలవు ఆ విద్యార్థుల చావుకొచ్చింది. ఈత సరదా ఇద్దరు చిన్నారుల ప్రాణాలు బలిగొంది. ఆదిలాబాద్ జిల్లా మావల మండలంలో చెరువులో మునిగి ఇద్దరు విద్యార్థులు మృతిచెందారు.

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం
38.5 /24.5

వాతావరణం పొడిగా ఉంటుంది. ఉష్ణోగ్రతలు పెరుగుతాయి. గాలిలో తేమ తగ్గుతుంది. వేడి, ఉక్కపోత ఎక్కువగా ఉంటుంది. రాత్రి కూడా వేడి గాలి వీస్తుంది.

న్యూస్‌రీల్

కల్యాణానికి తలంబ్రాలు



గోటితో తలంబ్రాలు ఒలుస్తున్న మహిళలు

లక్ష్మణచాంద: మండలంలోని చామన్‌పల్లి ఆలయంలో సీతారాముల కల్యాణోత్సవానికి తలంబ్రాలు సిద్ధం చేస్తున్నారు. గ్రామ మహిళలు శనివారం గోటితో ఒలిచి తలంబ్రాలు సిద్ధం చేశారు. మొత్తం లక్ష నూట పదహారు (1,00,116) తలంబ్రాలను చేతిలో ఒలిచినట్లు మహిళలు తెలిపారు.

15 నుంచి సీపీఐ జాతీయ మహాసభలు



మాట్లాడుతున్న నాయకులు

నిర్మల్‌చైన్‌గేట్: ఈనెల 15 నుంచి మూడు రోజులపాటు చెన్నైలో సీపీఐ జాతీయ సభలు నిర్వహించనున్నట్లు పార్టీ జిల్లా కార్యదర్శి విలాస్ తెలిపారు. తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ జిల్లాలోని రైతు సమస్యలపై, రైతు వ్యతిరేక చట్టాల రద్దుకై పోరాటాలు చేశామన్నారు. రైతు పండించే పంటలకు సకాలంలో నీరు అందించాలన్నారు. జిల్లాలో పెండింగ్లో ఉన్న చెక్‌డ్యాంలు పూర్తి చేయాలని కోరారు. సమావేశంలో ఎస్ఎన్.రెడ్డి, యల్ఆర్.ఉపాలి, రాజన్న, విఠల్ పాల్గొన్నారు.


కల్యాణానికి విరాళం..



అయిట్ల సుదర్శన్‌ను సన్మానిస్తున్న కమిటీ

లక్ష్మణచాంద: మండలంలోని చామన్‌పెల్లి గ్రామంలోని ప్రసిద్ధ రామాలయంలో ఆదివారం శ్రీరామ నవమి సందర్భంగా నిర్వహించే రాములోరి కల్యాణోత్సవానికి బీజేఎల్పీ నేత, నిర్మల్ ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి రూ.1.25 లక్షలు విరాళంగా అందించారు. బీజేపీ మండల నాయకులు ఆలయ కమిటీకి ఈ మొత్తం శనివారం అందించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు చిన్నయ్య, మాజీ ఎంపీపీ అడ్వాల రమేశ్, మాజీ ఎంపీటీసీ రాజు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు. ఇదే ఆలయానికి గ్రామానికి చెందిన అయిట్ల సుదర్శన్ రూ.32,100 విరాళంగా ఆలయంలో కమిటి సభ్యులకు అందజేశారు. ఇందులో ఆలయ కమిటీ సభ్యులు రాజేందర్, ప్రశాంత్ రెడ్డి, సాగర్‌రెడ్డి, మహిపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'బీజేపీతోనే అభివృద్ధి'



పీఏసీఎస్ భవనం ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

సారంగాపూర్: బీజేపీతోనే అభివృద్ధి సాధ్యపడుతుందని బీజేఎల్పీ నేత, నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి అన్నారు. మండలంలోని ఆలూరు గ్రామంలో నిర్మించిన పీఏసీఎస్ భవనం, 500 మెట్రిక్‌టన్నుల సామర్థ్యం గల గోదాంను శనివారం ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడు తూ గతంలో అధికారంలో ఉన్న బీఆర్ఎస్, ప్రస్తుతం కాంగ్రెస్ రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చాయని దుయ్యబట్టారు. కేంద్రంలో అధి కారంలో ఉన్న బీజేపీ సుస్థిర పాలన, సమగ్ర అభివృద్ధిని సాధిస్తోందని తెలిపారు. రైతులు పండించిన పంటలు నిల్వ చేసుకునేందుకు గోదాం ఉపయోగపడుతుందన్నారు. అనంతరం గ్రామానికి చెందిన చింతకుంట ముత్తన్నకు సీఎంఆర్ఎఫ్ నుంచి మంజూరైన రూ.2 లక్షల చెక్కును అందించారు. పీఏసీఎస్ చైర్మన్ మాణిక్‌రెడ్డి, బీజేపీ మండల అధ్యక్షుడు నరేశ్, నాయకులు సాహెబ్‌రావు, గంగారెడ్డి, రాజేందర్‌రెడ్డి, మధు, నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

సారుకు గుణపాఠం ఎలా?

- దారితప్పుతున్న గురువులు
- పాఠాలు చెప్పే స్థానంలో ఉండి.. పాడు పనులు
- ఆడపిల్లల తల్లిదండ్రుల్లో ఆందోళన..



సమాజంలో ఎలా ఉండాలో చెప్పేది గురువే. తరగతి గదిలో విద్య నేర్పే ఆ గురువులే దారితప్పుతున్నారు. పసిపిల్లలపై దాష్టీకాలకు పాల్పడుతున్నారు. చదువుచెప్పే సార్లే ఇలా ఉంటే.. వారికి ఎవరు బుద్ధి చెప్పాలన్న ప్రశ్నలు వస్తున్నాయి. పాఠం చెప్పే సార్‌కు గుణపాఠం చెప్పాల్సిన అవసరం రావడం దారుణమన్న చర్చ జిల్లాలో కొనసాగుతోంది. విద్యాశాఖపై కొంతకాలంగా ఏదో ఒక మచ్చ పడుతూనే ఉంది. మొన్నటి వరకు యూబిట్ కాయిన్ దందాలో అరెస్టులు కాగా, ఇప్పుడు ఏకంగా పోక్సో కేసుల్లో జైలు వెళ్తుండటంతో జిల్లా పరువు పోతోందన్న వాదన బలపడుతోంది. జిల్లా ఉన్నతాధికారులు దారితప్పుతున్న గురువులను గాడిలో పెట్టాలన్న డిమాండ్ పెరుగుతోంది. – నిర్మల్

చెప్పాల్సినవారే..

'ఇది తప్పమ్మా.. ఇలా ఉండొద్దు.. ఇలా చేయాలి.. వీరితో ఇలా ఉండాలి..' అంటూ ఇంట్లో అమ్మానాన్నల తర్వాత బడిలో ఉపాధ్యాయుడే పిల్లలకు మంచి చెడు చెబుతుంటారు. సమాజానికి మంచి పౌరుడిని ఇవ్వాల్సిన బాధ్యతలో తల్లిదండ్రుల కంటే టీచరే ముందుంటాడు. కానీ.. అలాంటి గురుతర స్థానంలో ఉండి ఇటీవల కొందరు చేస్తున్న పనులు మొత్తం సమాజమే తలదించుకునేలా చేస్తోంది. ఒకప్పుడు ఎక్కడో ఇలా జరుగుతున్న వాటిని వార్తల్లో చూసే జిల్లావాసులు ఇప్పుడు మన దగ్గరే ఇలాంటి ఘటనలు జరుగుతుంటే జీర్ణించుకోలేకపోతున్నారు.

ఎవరు చెప్పాలి..

విద్యార్థులపై అఘాయిత్యాలకు పాల్పడుతున్న ఘటనల్లో చాలావరకు రాజకీయాలూ చోటుచేసుకుంటుండటం మరీ దారుణం. నిందితుడు తమ సంఘానికో, వర్గానికో చెందిన వాడైతే సదరు సంఘాలు కనీసం ఘటనలను ఖండించడం లేదు. అదే ప్రత్యర్థి సంఘాల వారైతే పనిగట్టుకుని మరీ ప్రచారం చేయిస్తున్న తీరూ సమాజంలో సదరు సంఘాలపై ఉన్న గౌరవాన్నీ తగ్గిస్తోంది. ఇటీవల జిల్లాలో చోటుచేసుకున్న రెండుమూడు ఘటనల్లో కొన్ని ఉపాధ్యాయ సంఘాలు వ్యవహరించిన తీరుపైనా చర్చ కొనసాగుతోంది. తమ సభ్యుడో, ఉపాధ్యాయుడో దారి తప్పుతున్నట్లు తెలిస్తే.. మందలించి, దారిన పెట్టే బాధ్యత ఎవరిదన్న ప్రశ్న వస్తోంది. తమకేం పట్టదన్నట్లుగా ఉండే విద్యాశాఖాధికారులు, ఇటు తమ రాజకీయం తప్ప వ్యవస్థ గురించి ఆలోచించని సంఘాలు రెండింటి లోపంతో ఇలాంటి ఘటనలకు ఫుల్‌స్టాప్ పడటం లేదన్న విమర్శలు ఉన్నాయి.

త్వరలో అవగాహన..

జిల్లాలో వరుసగా విద్యార్థినులపై టీచర్ల అఘాయిత్యాలు పెరగడం, పోక్సో కేసులు నమోదు కావడంతో రాష్ట్రస్థాయిలో జిల్లా పేరు మసకబారుతోంది. ఈనేపథ్యంలో పలువురు సీనియర్ సిటిజనులు చేస్తున్న ఫిర్యాదుల మేరకు జిల్లా అధికారులే చొరవ తీసుకునే ప్రయత్నం చేస్తున్నారు. త్వరలోనే ఉపాధ్యాయులందరితో సమావేశాలు ఏర్పాటు చేసి బాధ్యతాయుతంగా మెలగాలని సూచించడంతోపాటు పోక్సో వంటి చట్టాలపైనా వారికి అవగాహన కల్పించే దిశగా కలెక్టర్ అభిలాష అభినవ్ యోచిస్తున్నారు.

సీరియస్‌గా తీసుకుంటాం..

జిల్లాలో అవాంఛనీయ ఘటనలపై సీరియస్‌గా వ్యవహరిస్తున్నాం. జిల్లా అభివృద్ధితోపాటు ఆత్మగౌరవానికీ ప్రాధాన్యతనిస్తాం. త్వరలోనే ఉపాధ్యాయులకు పోక్సోచట్టంతోపాటు వివిధ విషయాలపై అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేస్తాం.
– అభిలాష అభినవ్, కలెక్టర్

గురుకులాల్లో మరీ దారుణం..

ఇటీవల బడిలో, బడిబయటా.. కొంతమంది ఉపాధ్యాయులు వ్యవహరించిన తీరుతో ఇప్పటికే జిల్లా పరువు బజారున పడినట్లయింది. వీటితోపాటు ఇప్పుడిప్పుడే మరికొన్ని దారుణాలు బయటకు రావడం శోచనీయం.

- భైంసా డివిజన్‌లోని ఓ ఆశ్రమ పాఠశాల ఉపాధ్యాయుడూ తన వద్ద చదువుకునే విద్యార్థినులపై అఘాయిత్యానికి పాల్పడ్డట్లు తెలుస్తోంది. సదరు ఉపాధ్యాయుడిపై ఫిర్యాదులు వచ్చినా సంబంధిత శాఖ అధికారి వెనకేసుకు వస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి.
- సారంగాపూర్ మండలంలోని మరోశాఖకు చెందిన గురుకులంలో బాలురపైనా అఘాయిత్యాలు జరుగుతున్నా.. సదరు శాఖాధికారులు పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి.
- మరోశాఖ గురుకులాలకు సంబంధించిన ఓ ఉమ్మడిజిల్లా అధికారిపైన ఇటీవల ఆరోపణలు, ఫిర్యాదులు వచ్చినా సరైన చర్యలు తీసుకోలేదన్న విమర్శలు ఉన్నాయి.
- ఖానాపూర్ మండలంలో పేరున్న ఓ ప్రభుత్వ పాఠశాలలో పనిచేసే ఉపాధ్యాయుడిపైనా గతంలో తల్లిదండ్రులు ఫిర్యాదు చేశారు.

ఉల్లి రైతు.. కంటనీరు..



ఈ చిత్రంలో కనిపిస్తున్న రైతు పేరు అంతకర్ మాదేశ్. తానూరు మండలం ఎల్వి గ్రామానికి చెందిన మాదేశ్ ఈ ఏడాది ఎకరం విస్తీర్ణంలో ఉల్లిసాగు చేశాడు. డిసెంబర్, జనవరిలో ఉల్లి ధర క్వింటాల్‌కు రూ.3 వేలకుపైనే ఉంది. దీంతో మంచి లాభాలు వస్తాయని భావించాడు. వారం క్రితం పంట చేతికి వచ్చింది. 50 క్వింటాళ్ల దిగుబడి వచ్చినా.. ప్రస్తుతం క్వింటాల్ ధర రూ.1000 నుంచి రూ.1,300 మాత్రమే పలుకుతోంది. దీంతో నిజామాబాద్ మార్కెట్‌కు తీసుకువెళ్లి దళారులకు అమ్ముకున్నాడు. రూ.60 వేలు వచ్చింది. పంట సాగుకు 40 వేలకుపైగా ఖర్చు పెట్టాడు. ఆరు నెలలు కష్టపడితే మిగిలింది. రూ.20 వేలే.

- దిగుబడి వచ్చేనాటికి పడిపోయిన ధర
- క్వింటాల్‌కు రూ.1000 నుంచి రూ.1,300..
- పెట్టుబడి కూడా రావడం లేదంటున్న రైతులు
- మార్కెట్ లేక మరింత నష్టం..

తానూరు: జిల్లాలో ఎక్కువ మంది వ్యవసాయంపైనే ఆధారపడ్డారు. గ్రామీణ ప్రాంతాల్లో చాలా మంది భూమినే నమ్ముకున్నారు. అయితే ప్రకృతి వైపరీత్యాలు, మార్కెట్ ఒడిదుడుకులతో రైతులకు ఆశించిన దిగుబడి, లాభాలు రావడం లేదు. దిగుబడి బాగుంటే ధర పడిపోతోంది. ధర బాగుంటే దిగుబడి రావడం లేదు. తాజాగా ఈ యాసంగిలో జిల్లాలో ఉల్లి సాగు చేసిన రైతులకు ఆశించిన లాభాలు రావడం లేదు. ఈ ఏడాది డిసెంబర్, జనవరి నెలల్లో ఉల్లి ధర మార్కెట్‌లో కిలోకు రూ.40 నుంచి రూ.60 వరకు ఉంది. క్వింటాల్ ధర రూ.3 వేలకుపైనే పలికింది. ఈ డిమాండ్‌ను గమనించిన జిల్లా రైతులు ఉల్లి సాగుపై దృష్టి సారించారు. తానూరు మండలంలో ఈ సీజన్‌లో ఉల్లి పంట అధిక విస్తీర్ణంలో సాగైంది. అయితే, పంట కోతకు వచ్చే సమయానికి ధర పడిపోయింది. ప్రస్తుతం క్వింటాల్‌కు రూ.1,300 మాత్రమే ధర పలుకుతోంది. దీంతో పెట్టుబడి ఖర్చులు, కూలీల ఖర్చులు కూడా రావడం లేదని రైతుల ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వానాకాలం పంట నష్టపోయామని, యాసంగి పంటతో అప్పులు తీరుతాయని ఆశించిన రైతులకు నిరాశే మిగిలింది. ప్రభుత్వం ఉల్లిని కొనుగోలు చేసి గిట్టుబాటు ధర కల్పిస్తేనే రైతులకు లాభం వస్తుందని కోరుతున్నారు.

మార్కెట్ లేక..

జిల్లాలో ఉల్లి మార్కెట్ లేకపోవడంతో రైతులు దళారులపై ఆధారపడుతున్నారు. ఉల్లిని నిజామాబాద్, నాందేడ్ వంటి దూర ప్రాంతాలకు తీసుకెళ్లి అమ్ముకుంటున్నారు. రవాణా ఖర్చులు భరించలేని వారు దళారులకు తక్కువ ధరకే అమ్ముతూ నష్టపోతున్నారు. నిర్మల్, భైంసాలో మార్కెట్ ఏర్పాటు చేస్తే ఈ సమస్య తగ్గుతుందని రైతులు సూచిస్తున్నారు.

మార్కెట్ ఏర్పాటు చేయాలి



ప్రభుత్వం స్థానికంగా ఉల్లి మార్కెట్ ఏర్పాటు చేయాలి. భైంసా పట్టణంలో ఉల్లి మార్కెట్ ఏర్పాటు చేస్తే రైతులకు అమ్ముకునేందుకు సౌకర్యవంతంగా ఉంటుంది. ప్రభుత్వం ఇతర పంటలకు గిట్టు బాటు ధర కల్పించినట్టు ఉల్లి పంటకు గిట్టుబాటు ధర కల్పించి కొనుగోలు చేస్తే రైతులకు నష్టాలు ఉండవు. – అసం ధర్మన్న ఎల్వి, రైతు

సమానత్వం కోసం పోరాడిన జగ్జీవన్‌రామ్



నివాళులర్పిస్తున్న, కలెక్టర్ అభిలాష అభినవ్, అధికారులు, వివిధ సంఘాల నాయకులు

నిర్మల్‌చైన్‌గేట్: సమానత్వం, సామాజిక న్యాయం కోసం భారత మాజీ ఉపప్రధాని, స్వాతంత్ర్యసమరయోధుడు డాక్టర్ బాబు జగ్జీవన్‌రామ్ పోరాడారని, ఆయన జీవితం అందరికీ స్ఫూర్తి దాయకమని కలెక్టర్ అభిలాష అభినవ్ అన్నారు. కలెక్టరేట్‌లో జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన బాబు జగ్జీవన్ రామ్ 118వ జయంతి వేడుకల్లో పాల్గొన్నారు. అధికారులు, నాయకులతో కలిసి ఆయన చిత్రపటానికి కలెక్టర్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మహనీయుడి సేవలను స్మరించుకోవడం మనందరికీ గర్వకారణమన్నారు. స్వాతంత్ర్య భారతదేశానికి ఒక దీపస్తంభంలా నిలిచారని, సామాజిక సమానత్వానికి, దళితుల హక్కుల కోసం బాబు జగ్జీవన్‌రామ్ పోరాటం చేశారని గుర్తు చేశారు. ఉప ప్రధానిగా, కార్మిక, వ్యవసాయ, రక్షణ శాఖ మంత్రిగా వివిధ కీలక బాధ్యతలు నిర్వహించారని వివరించారు. అత్యంత కఠిన పరిస్థితుల్లో, నిరంకుశ భేదాభిప్రాయాలను ఎదుర్కొంటూ, విద్య, విజ్ఞానం, విలువలతో ఆయన ఎదిగిన విధానం నేటి యువతకు ఒక ప్రేరణగా నిలుస్తుందన్నారు. కార్యక్రమంలో జిల్లా సంక్షేమ శాఖల అధికారులు రాజేశ్వర్‌గౌడ్, శ్రీనివాస్, అంబాజీ, శంకర్, సిబ్బంది, దళిత సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఆర్జీయూకేటీలో..



నివాళులర్పిస్తున్న అధికారులు, విద్యార్థులు

బాసర: బాసరలోని ఆర్జీయూకేటీలో ఎస్సీ, ఎస్టీ సెల్ ఆధ్వర్యంలో బాబు జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఇన్‌చార్జి వీసీ ప్రొఫెసర్ గోవర్ధన్ ఆదేశాల మేరకు ఓఎస్డీ ప్రొఫెసర్ ఈ మురళీధర్శన్, ఏవో రణధీర్ జయంతి వేడుకలకు హాజరై బాబు జగ్జీవన్ రామ్‌కు నివాళులర్పించారు. మురళీదర్శన్ మాట్లాడుతూ బాబూ జగ్జీవన్ రామ్ సమాజంలోని పేద, వెనుకబడిన వర్గాల అభ్యున్నతికి జీవితాంతం కృషి చేశారన్నారు. కార్యక్రమంలో అసోసియేట్ డీన్ డాక్టర్ విఠల్, ఎస్సీ, ఎస్టీ సెల్ కన్వీనర్ డాక్టర్ అజయ్, డాక్టర్ విజయ్‌కుమార్, సతీశ్ కుమార్, శంకర్, శ్యాంబాబు, శ్యాంసుందర్, దస్తగిరి, ఉపేందర్, నాగరాజు, హరికృష్ణ, ఉద్యోగులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సీతారాముల కల్యాణం.. చూతము రారండి

'శ్రీసీతారాముల కల్యాణం చూతము రారండి..' అంటూ రాములోరి పెళ్లి చూసేందుకు జిల్లా సిద్ధమైంది. జగదభిరాముడి కల్యాణోత్సవాన్ని అంగరంగ వైభవంగా జరిపించేందుకు రామాలయాలను ముస్తాబు చేశారు. ఊరంతా వీక్షించేందుకు వాడంతా చలువ పందిళ్లు వేశారు. ఇప్పటికే కొత్తరంగులద్దుకుని, విద్యుల్లతలతో రామాలయాలు కాంతులీనుతున్నాయి. హిందూ సంస్థల ఆధ్వర్యంలో నిర్మల్, భైంసాల్లో భారీ శోభాయాత్రలను చేపట్టనున్నారు. ఈమేరకు పోలీసులూ బందోబస్తు ఏర్పాట్లు చేస్తున్నారు. – నిర్మల్/నెట్‌వర్క్

- రాములోరి పెళ్లికి ముస్తాబైన ఆలయాలు
- ఊరూరా జరగనున్న కళ్యాణ వేడుకలు
- నిర్మల్, భైంసాలో శోభాయాత్రలు
- భారీ బందోబస్తుకు సిద్ధమైన పోలీసులు



జామ్‌లో కొలువుదీరిన పట్టాభిరాముడు

అడుగడుగునా రాముడు..

'శ్రీరాముడుండని ఇల్లు లేదు, రామాలయం లేని ఊరు లేదు..' అన్నట్లుగా జిల్లావ్యాప్తంగా ప్రతీ మండలంలో సీతారాములు కొలువుదీరి ఉన్నారు. శ్రీరామ నవమి పర్వదినానికి ఈ ఆలయాలన్నీ ముస్తాబయ్యాయి. పండుగరోజు పొద్దున్నుంచే భక్తులు సీతారాముల దర్శనాలు చేసుకుంటారు. ఉత్సవమూర్తులతో మధ్యాహ్నం వరకూ కొనసాగే కల్యాణోత్సవాన్ని కనులారా వీక్షించి, ఆలయాల్లోనే అన్నప్రసాదాన్ని స్వీకరిస్తారు. ఇందుకు సంబంధించి ఆలయకమిటీలు అన్నిఏర్పాట్లు పూర్తిచేశాయి.

జిల్లాకేంద్రంలో..

నిర్మల్‌టౌన్: శ్రీరామనవమి ఉత్సవానికి జిల్లాకేంద్రంలోని రామాలయాలలో ఏర్పాట్లు పూర్తిచేశారు.

- బాగులవాడ వాల్మీకినగర్ రామాలయంలో ఈసారి ఆలయకమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టారు. ఇంట్లో వివాహానికి ఎలాగైతే ఏర్పాట్లు చేస్తామో అలాగే.. రాములోరి పెళ్లికి పందిరి, పసుపుదంచడం తదితర కార్యక్రమాలన్నీ చేశారు. కల్యాణానికి భారీగా విచ్చేసే భక్తులకు ఇబ్బందులు లేకుండా అన్నిఏర్పాట్లు చేశారు.
- బ్రహ్మపురి రాంమందిర్‌కు వందల ఏళ్ల చరిత్ర ఉంది. ఒకప్పుడు తడకలతో నిర్మించబడి, చెక్క విగ్రహాలకు పూజలు చేయబడిన ఆలయమిది. 1980లో ఆలయ నిర్మాణం, విగ్రహ ప్రతిష్టాపన చేశారు. అప్పటి నుంచి శ్రీరామనవమి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు.
- శాంతినగర్ రామాలయంలో శ్రీరామనవమి ఉత్సవాలకు ఇప్పటికే ఏర్పాట్లు పూర్తిచేశారు.



వాల్మీకినగర్‌లో పసుపు దంచుతున్న మహిళలు

విశాలమైన ఆలయ ప్రాంగణంలో సీతారాముల కల్యాణోత్సవం కనులపండువగా సాగనుంది. కామోల్ రామాలయంలో.

భైంసారూరల్: మండలంలోని కామోల్ గ్రామంలో దాదాపు 300 ఏళ్లుగా శ్రీరామనవమి ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. ఉగాది నుంచి నవమి వరకు కొనసాగుతాయి. వందల ఏళ్లక్రితం ఇక్కడ కొలువైన సీతారాముల కల్యాణమూ అంగరంగవైభవంగా సాగుతుంది.

'శ్రీరామ్'నగర్‌లో..

ఖానాపూర్: పట్టణంలో రాముడి పేరుమీదుగా గల శ్రీరామ్‌నగర్ కాలనీ సీతారామాంజనేయ ఆలయంలో ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తారు.

చామన్‌పల్లిలో రాములోరి పెళ్లి..

లక్ష్మణచాంద: మండలంలోని చామన్‌పల్లిలో గ్రామస్తులంతా సమష్టిగా శ్రీరామనవమి వేడుకను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. చలువ పందిళ్లు వేసి, విద్యుత్ దీపాలతో ఆలయాన్ని అలంకరించారు.

జామ్‌లో 'పట్టాభిరాముడు'..

సారంగపూర్: మండలంలోని జామ్ రామాలయానికి ఓ ప్రత్యేకత ఉంది. ఇక్కడ శ్రీరాముడు సకుటుంబ సపరివారసమేతంగా పట్టాభిరాముడిగా కొలువుదీరడం విశేషం. శ్రీరామనవమికి స్థానికులు ఘనంగా ఏర్పాట్లు చేశారు.

రాంపూర్ రామయ్య...

నిర్మల్: నర్సాపూర్(జి) మండలంలోని రాముడి పేరుతో వెలిసిన రాంపూర్‌లో గ్రామంలోని రామాలయంలో నవమి ఉత్సవాలు ఘనంగా నిర్వహించనున్నారు. మండలకేంద్రంలోని శ్రీరామాలయం సైతం స్వామివారి కల్యాణోత్సవానికి ముస్తాబైంది.

నిర్మల్, భైంసాలో శోభాయాత్రలు..

శ్రీరామనవమి పురస్కరించుకుని హిందూవాహిని, బజరంగ్‌దళ్ తదితర హిందూసంస్థలు కొన్నేళ్లుగా శోభాయాత్రలు నిర్వహిస్తున్నాయి. జిల్లాకేంద్రంలో ప్రతీసారి శ్రీరామనవమి, హనుమాన్ జనోత్సవాలకు హిందూవాహిని, బజరంగ్‌దళ్ సంస్థలు వేర్వేరుగా శోభాయాత్రలు చేపట్టేవి. ఈసారి నవమి రోజున ఒకేసారి రెండుసంస్థలు ర్యాలీ నిర్వహిస్తున్నాయి. స్థానిక దేవరకోట నుంచి ప్రారంభమయ్యే ర్యాలీలో బీజేఎల్పీ నేత మహేశ్వర్‌రెడ్డి పాల్గొననున్నారు. భైంసాలో చేపట్టనున్న ర్యాలీలో ఎంపీ గోడం నగేశ్, ఎమ్మెల్యే రామారావుపటేల్ తదితరులు హాజరుకానున్నారు. రెండుచోట్లా ఉదయమే ర్యాలీలను నిర్వహించనున్నారు. జిల్లాలో శ్రీరామనవమి ఉత్సవాలు, భారీ ర్యాలీల నేపథ్యంలో పోలీసులూ అలర్ట్ అయ్యారు. ఇప్పటికే భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. శ్రీరామనవమి కార్యక్రమాలు ప్రశాంతంగా పూర్తిచేసుకునేందుకు అందరూ సహకరించాలని ఎస్పీ జానకీషర్మిల కోరారు.

పరిమండల్‌లో..

మామడ: మండలంలోని పరిమండల్‌లో నూతనంగా నిర్మించిన రామాలయంలో కొలువుదీరిన సీతారాములు కల్యాణోత్సవానికి ముస్తాబయ్యారు.

కడెం ఒడ్డున కొలువైన రాముడు..

కడెం: మండలకేంద్రంలోని కడెం ప్రాజెక్టు దిగువన సీతారాముడు కొలువై ఉన్నాడు. ఏళ్లుగా ఇక్కడ శ్రీరామనవమి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. పండుగ కోసం అన్నిఏర్పాట్లు పూర్తిచేశారు.

శ్రీరామ్‌సాగర్ దిగువన..

సోన్: మండలంలోని శ్రీరామ్‌సాగర్ ప్రాజెక్టు దిగువన పాత(లెఫ్ట్)పోచంపాడ్ గ్రామంలోని పురాతన రామాలయంలో శ్రీరామనవమి ఉత్సవాలకు ఘనంగా ఏర్పాట్లు చేశారు. చలువపందిళ్ల కింద స్వామివారి పెళ్లికి ముస్తాబుచేశారు.

కోర్టును ప్రారంభించిన హైకోర్టు జడ్జి



కోర్టును ప్రారంభిస్తున్న జడ్జి లక్ష్మీనారాయణ

నిర్మల్ టౌన్: జిల్లా కేంద్రంలోని ప్రధాన కోర్టు ఆవరణంలో కోర్ట్ ఆఫ్ అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి కమ్ –2 జుడికల్ మేజిస్ట్రేట్ ఆఫ్ ఫస్ట్ క్లాస్ కోర్టును హైకోర్టు జడ్జి జస్టిస్ అలిశెట్టి లక్ష్మీనారాయణ శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలకు న్యాయ సేవలు మరింత చేరువ కావాలని ఈ కోర్టును ప్రారంభించినట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన జడ్జి కర్ణకుమార్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మల్లారెడ్డి, జడ్జీలు, న్యాయవాదులు పాల్గొన్నారు.

కోర్టు భవనం నిర్మించాలని వినతి

ఖానాపూర్: పట్టణంలోని కోర్టుకు కేటాయించిన 5 ఎకరాల స్థలంలో శాశ్వత భవన నిర్మాణం చేపట్టాలని ఖానాపూర్ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో హైకోర్టు జడ్జి అలిశెట్టి లక్ష్మీనారాయణకు విన్నవించారు. కోర్టు ప్రారంభోత్సవానికి వచ్చిన హైకోర్టు జడ్జి, పోర్టు ఫోలియో జడ్జి అలిశెట్టి లక్ష్మీనారాయణతోపాటు జిల్లా జడ్జి కర్ణకుమార్‌ను కలిశారు. ఈమేరకు వినతిపత్రాన్ని అందజేశారు. ప్రైవేట్ భవనంలో ప్రస్తుతం నడుస్తున్న కోర్టులో ఇబ్బందులు ఉన్నాయని తెలిపారు. తమ వినతికి జడ్జీలు సానుకూలంగా స్పందించారని ఖానాపూర్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మంత్రరాజం సురేశ్ తెలిపారు. అనంతరం జడ్జిని సన్మానించి జ్ఞాపిక అందజేశారు. కార్యక్రమంలో ఖానాపూర్ బార్ అసోసియేషన్ కార్యదర్శి పి.రాజలింగం, న్యాయవాదులు నేరెళ్ల సత్యనారాయణ, గుగ్లావత్ కిశోర్‌నాయక్, ఎం డీ.ఖాజా, ఎర్ర రవి, ఏజీపీ ఆసిఫ్ అలీ పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఒకరిపై కేసు నమోదు

వేమనపల్లి: మండలంలోని మంగెనపల్లిలో శుక్రవారం పాలేరు నాయిని కన్నయ్య మృతికి కారణమైన యజమాని ఎనగంటి చిన్నన్నపై కేసు నమోదు చేసినట్లు నీల్వాయి ఎస్సై శ్యాంపటేల్ తెలిపారు. శనివారం చెన్నూర్ ప్రభుత్వాస్పత్రిలో పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని స్వగ్రామానికి తరలించారు.

పేకాడుతున్న తొమ్మిది మంది అరెస్టు

బెల్లంపల్లి: పట్టణంలోని అశోక్‌నగర్ బస్తీలో శనివారం పేకాటస్థావరంపై దాడిచేసి పేకాడుతున్న తొమ్మిది మందిని అరెస్టు చేసినట్లు వన్‌టౌన్ ఎస్‌హెచ్‌వో ఎన్.దేవయ్య తెలిపారు. బస్తీకి చెందిన ముక్కెర వెంకటేష్ ఇంటి వద్ద కొందరు పేకాడుతున్నట్లు వచ్చిన సమాచారం మేరకు దాడులు నిర్వహించిన బెల్లంపల్లికి చెందిన ముక్కెర వెంకటేష్, జంగం క్రాంతికుమార్, గొడుగు రమేశ్, తొగరి సురేష్, యాదగిరి మహేష్, బాకం సుమన్, గజ్జల స్వామి, ఎరుకల శ్రీనివాస్, సుందురీ మల్లాద్రిని అరెస్టు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. వారి వద్ద నుంచి 52 పేక ముక్కలు, రూ.12,550 నగదు, 7 ఫోన్లు, 5 బైక్‌లు స్వాధీనం చేసుకుని నిందితులపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు.

గంజాయి స్వాధీనం



వివరాలు సేకరిస్తున్న ఎస్సై విజయ్

కెరమెరి: మండలంలోని ధనోరా గ్రామ సమీపంలో ఉన్న తుమ్మగూడలో శనివారం పుస్నక తుకారాం వద్ద నుంచి రూ.6,375 విలువ చేసే గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై గుంపుల విజయ్ తెలిపారు. తమకు అందిన సమాచారం మేరకు తుకారం ఇంటి పెరట్లో తనిఖీలు నిర్వహించగా గంజాయి మూట కనిపించిందన్నారు. నిందితుడు తుకారాంపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలు

నిర్మల్: నర్సాపూర్ (జి) మండలంలోని చాక్‌పల్లి శివారులో 61వ జాతీయ రహదారిపై శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల మేరకు... చాక్‌పల్లి గ్రామానికి చెందిన బ్యాగరి చిన్న భోజన్న ద్విచక్ర వాహనంపై వ్యవసాయ క్షేత్రానికి వెళ్తుండగా భైంసా నుంచి నిర్మల్ వైపు అతివేగంగా వెళ్తున్న కారు వెనుక నుండి ఢీకొట్టింది. ఘటనలో చిన్న భోజన్నకు తీవ్రగాయాలు కావడంతో గమనించిన స్థానికులు 108కు సమాచారం అందించారు. క్షతగాత్రున్ని నిర్మల్ ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

వేదపాఠశాల విద్యార్థి మృతిపై కేసు

బాసర: నిర్మల్ జిల్లా బాసరలోని వేద పాఠశాల విద్యార్థి మణికంఠ మృతిపై శనివారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై గణేశ్ తెలిపారు. మృతిపై అనుమానాలు ఉన్నాయని మృతుని తండ్రి హనుమకొండ జిల్లా శాయంపేటకు చెందిన బండారి రాజేందర్ ఫిర్యాదు చేశారు. వేద పాఠశాల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని కోరారు.

సెలవు చావుకొచ్చింది!

- ఈతకు వెళ్లి ఇద్దరు విద్యార్థులు మృతి
- ఇద్దరినీ మింగిన చెరువు
- ఆదిలాబాద్ జిల్లాలో ఘటన
- రెండు కుటుంబాల్లో విషాదం



సంజీవ్ (ఫైల్)



రాహుల్ (ఫైల్)



విలపిస్తున్న రాహుల్ కుటుంబ సభ్యులు

ఆదిలాబాద్‌రూరల్: సెలవు ఆ విద్యార్థుల చావుకొచ్చింది. ఈత సరదా ఇద్దరు చిన్నారుల ప్రాణాలు బలిగొంది. ఆదిలాబాద్ జిల్లా మావల మండలంలో జరిగిన సంఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. ఏపీలోని వైజాగ్‌కు చెందిన కాంబ్లే దుర్గాప్రసాద్, సత్యభామ దంపతులు ఐదేళ్ల క్రితం ఉపాధి నిమిత్తం ఆదిలాబాద్‌కు వచ్చారు. మావల మండల కేంద్రంలోని 170 కాలనీలో గుడిసెలు వేసుకుని నివాసం ఉంటున్నారు. వారికి రాహుల్ (9) (నాలుగో తరగతి), విశాల్ ఇద్దరు కుమారులు. ఇద్దర్నీ మావల మండల కేంద్రంలోని ఎంపీపీఎస్2లో చదివిస్తున్నారు. శనివారం పాఠశాలకు సెలవు ఉండడంతో రాహుల్, విశాల్, స్నేహితుడు చిప్పకుర్తి సంజీవ్ (10)తో కలిసి ఈత కొట్టేందుకు మండల కేంద్రంలోని జాతీయ రహదారి 44కు ఆనుకుని ఉన్న ఎర్రకుంట చెరువు వద్దకు వెళ్లారు. రాహుల్, సంజీవ్ స్నానం చేసేందుకు చెరువులోకి దిగారు. విశాల్ చెరువు చుట్టుపక్కల ఆడుకుంటూ ఉన్నాడు. కొంత సేపటికి రాహుల్, సంజీవ్ నీటిలో మునిగిపోవడంతో గమనించిన విశాల్ విషయాన్ని స్థానికులతో పాటు కుటుంబ సభ్యులకు స మాచారం అందించాడు. మావల పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని గజ ఈతగాళ్ల సాయంతో మృతదేహాలను వెలికితీయించారు. పోస్టుమార్టం నిమిత్తం జిల్లా కేంద్రంలోని రిమ్స్ మార్చురీకి తరలించారు.

రెండు రోజుల్లో పుట్టిన రోజు..

గుడిహత్నూర్ మండల కేంద్రానికి చెందిన చిప్పకుర్తి రాజ్‌కుమార్ కుమారుడు సంజీవ్ నానమ్మ తారాబాయి వద్ద ఉండి మావల పాఠశాలలో ఐదోతరగతి చదువుతున్నాడు. మరో రెండు రోజుల్లో అతని పుట్టినరోజు ఉంది. ఇందుకోసం తారాబాయి తన పింఛన్ డబ్బులతో కొత్త బట్టలు కొనిచ్చేందుకు తీసుకెళ్దామని అనుకుంది. అంతలోనే స్నేహితులు రావడంతో వారితో కలిసి ఆడుకునేందుకు బయటకు వెళ్లాడు. కొద్దిసేపటికే ఈ విషాదకర వార్త తెలియడంతో తారాబాయి అక్కడికి చేరుకుని నా కోరిక తీరక ముందే వెళ్లిపోయావా.. అంటూ గుండెలు బాదుకుంటూ విలపించిన తీరు పలువురిని కంటతడి పెట్టించింది. ఇరువురి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై విష్ణువర్ధన్ తెలిపారు.

వాలీబాల్ పోటీల విజేత హైదరాబాద్



రన్నరప్‌గా నిలిచిన బెల్లంపల్లి జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న జీఎం విజయ భాస్కర్‌రెడ్డి

రెబ్బెన(ఆసిఫాబాద్): గోలేటి టౌన్‌షిప్‌లోని భీమన్న స్టేడియంలో సింగరేణి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 36వ వేణుగోపాల్ మెమోరియల్ ఇన్విటేషనల్ వాలీబాల్ పోటీలు శనివారంతో ముగిశాయి. హైదరాబాద్ జట్టు విజేతగా బెల్లంపల్లి జట్టు రన్నరప్‌గా నిలిచాయి. నాకౌట్ కం లీగ్ పద్ధతిలో నిర్వహించిన సెమీ ఫైనల్, ఫైనల్ పోటీల్లో ఇరు జట్లు హోరాహోరీగా తలపడ్డాయి. హైదరాబాద్ జట్టు అద్భుత ఆటతీరును ప్రదర్శించి విజయ కేతనం ఎగురవేసింది.

సింగరేణిలో క్రీడలకు పెద్దపీట

సింగరేణి యాజమాన్యం క్రీడలకు పెద్దపీట వేస్తోందని బెల్లంపల్లి ఏరియా జనరల్ మేనేజర్ విజయ భాస్కర్‌రెడ్డి అన్నారు. శనివారం భీమన్న స్టేడియంలో నిర్వహించిన వాలీబాల్ పోటీల్లో విజేతలకు బహుమతి ప్రదానోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సింగరేణిలో పని చేసిన ఓ ఉద్యోగి పేరుతో 36 సంవత్సరాలుగా రాష్ట్రస్థాయి పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. క్రీడాకారుల్లో క్రమశిక్షణ, క్రీడాస్ఫూర్తి ఎంతో అవసరమన్నారు. పోటీల్లో గెలుపు ఓటములు సర్వసాధారణమని, ఓటమిని కారణాలను విశ్లేషించుకుంటూ గెలుపు దిశగా క్రీడాకారులు పయనించాలన్నారు. అనంతరం విజేతగా నిలిచిన హైదరాబాద్ జట్టుకు ట్రోఫీతో పాటు రూ.30 వేల నగదు, రన్నరప్‌గా నిలిచిన బెల్లంపల్లి జట్టుకు ట్రోఫీతో పాటు రూ. 20 వేల నగదు బహుమతి అందజేశారు. ఈ కార్యక్రమాల్లో ఏఐటీయూసీ బ్రాంచి కార్యదర్శి ఎస్.తిరుపతి, డీజీఎం ఐఈడీ ఉజ్వల్‌కుమార్ బెహెరా, పర్సనల్ మేనేజర్ రెడ్డి మల్ల తిరుపతి, సీనియర్ పర్సనల్ అధికారులు శ్రీనివాస్, ప్రశాంత్, ఆర్జీ–2 ఏరియా స్పోర్ట్స్ సూపర్‌వైజర్ నరేందర్‌రెడ్డి, బెల్లంపల్లి రీజియన్ స్పోర్ట్స్ సూపర్‌వైజర్ అశోక్, స్పోర్ట్స్ కోఆర్డినేటర్ కిరణ్‌బాబు, తదితరులు పాల్గొన్నారు.

బాసరలో విద్యుత్ దీపాల ఏర్పాటు



‘భక్తుల భద్రత గాలిలో దీపమే’ శీర్షికన ‘సాక్షి’లో శనివారం ప్రచురితమైన కథనానికి బాసర గ్రామ పంచాయతీ ఈవో ప్రసాద్‌గౌడ్ స్పందించారు. బాసర ఆలయంతో పాటు ప్రధాన కూడళ్లు, రైల్వే స్టేషన్, గోదావరి నది స్నాన ఘట్టాలు, తదితర ప్రాంతాల్లో ‘సాక్షి’ పరిశీలన చేపట్టింది. రాత్రి సమయంలో చీకట్లో ఉన్న పరిస్థితులను కథనంలో ప్రచురించింది. స్పందించిన అధికారులు రైల్వే స్టేషన్, బస్టాండ్, ప్రధాన రోడ్ల వద్ద వీధి దీపాలు ఏర్పాటు చేశారు. – భైంసా/బాసర



రైల్వేస్టేషన్ వద్ద విద్యుత్ దీపాలు

కళాకారులకు ఉపాధి కల్పిస్తాం

- టీవీ ఫెడరేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు సురేశ్



మాట్లాడుతున్న నాగబాల సురేశ్

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లాలోని కళాకారులకు ఉపాధి కల్పించడమే లక్ష్యంగా ముందుకెళ్తున్నామని తెలంగాణ టీవీ ఫెడరేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు నాగబాల సురేశ్‌కుమార్ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని పిక్చర్ టైం థియేటర్‌లో ఔత్సాహిక కళాకారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో యువ దర్శకుడు దండనాయకుల మానస్‌తో కలిసి మాట్లాడారు. జిల్లాలో అనేక ప్రకృతి వనరులు ఉన్నాయని, వీటిని పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకుంటే సినిమా, సీరియల్స్ షూటింగ్‌లకు ఎంతగానో ఉపయోగపడుతాయన్నారు. ఇప్పటి వరకు 27 సీరియల్స్, 927 డాక్యుమెంటరీలు నిర్మించినట్లు తెలిపారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నుంచి 110 మందిని బుల్లితెరకు పరిచయం చేసినట్లు తెలిపారు. రానున్న రోజుల్లో మరింత మందికి అవకాశం కల్పిస్తామన్నారు. షూటింగ్ కోసం జిల్లాకు వచ్చే కళాకారులకోసం ప్రత్యేక స్టూడియోలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఇదే విషయాన్ని సీఎంతో పాటు, సినిమా ఇండస్ట్రీ చైర్మన్ దిల్‌రాజు దృష్టికి తీసుకెళ్లానన్నారు. సమావేశంలో నవజ్యోతి సాంస్కృతిక సారథి అధ్యక్షుడు ధర్మపురి వెంకటేశ్వర్లు, సభ్యులు రాధాకృష్ణాచారి, జిల్లాలోని కళాకారులు పాల్గొన్నారు.

పీఏసీఎస్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడిగా రాజన్న



కావటి రాజన్న

జన్నారం: పీఏసీఎస్ ఉద్యోగుల సంఘం మంచిర్యాల జిల్లా అధ్యక్షుడిగా జన్నారం మండలంలోని పొనకల్ పీఏసీఎస్ కార్యదర్శి కావటి రాజన్న శనివారం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మంచిర్యాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో సంఘం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా మచ్చా మధుకర్, ప్రధాన కార్యదర్శిగా విష్ణువర్ధన్‌రావు, సలహాదారులుగా రాజిరెడ్డి, లక్ష్మారెడ్డి, సత్యనారాయణను ఎన్నుకున్నట్లు ఆయన పేర్కొన్నారు.

కూరగాయలు అమ్మేందుకు వచ్చి మృత్యుఒడిలోకి..

- విద్యుత్‌షాక్‌తో యువరైతు మృతి



పొచ్చన్న (ఫైల్)

తాంసి: కూరగాయలు విక్రయించేందుకు వచ్చి విద్యుత్ షాక్‌తో యువరైతు మృతి చెందిన సంఘటన జిల్లా కేంద్రంలో చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం తాంసి మండలంలోని పొన్నారి గ్రామానికి చెందిన అశిలీ పొచ్చన్న (38) తనకున్న ఎకరంతో పాటు మరో నాలుగెకరాలు కౌలుకు తీసుకుని 20 ఏళ్లుగా కూరగాయలు సాగు చేస్తున్నాడు. వాటిని జిల్లా కేంద్రంలోని రైతు బజార్‌కు తీసుకెళ్లి విక్రయిస్తుంటాడు. శుక్రవారం సాయంత్రం కూరగాయలు విక్రయించడానికి జిల్లా కేంద్రంలోని రైతు బజార్‌కు వచ్చాడు. విక్రయించిన అనంతరం రాత్రి సమయంలో విద్యుత్‌బల్బును తొలగించే క్రమంలో షాక్ కొట్టడంతో పక్కనున్న రాళ్లపై పడి అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. గమనించిన స్థానికులు ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మృతుని భార్య మమత ఫిర్యాదు మేరకు వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై సునీల్ తెలిపారు.

ట్రాక్టర్ ఢీకొని యువకుడు మృతి

వాంకిడి: ట్రాక్టర్ ఢీకొని యువకుడు మృతి చెందిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఏఎస్సై పోశెట్టి తెలిపిన వివరాల మేరకు సిర్పూర్(టి) మండలంలోని మేడ్‌పెల్లి గ్రామానికి చెందిన మడావి రాజ్‌కుమార్ (22) శుక్రవారం వాంకిడి మండలంలోని బండకాస గ్రామంలో ఉన్న బంధువుల ఇంట్లో పెళ్లికి వచ్చాడు. పని నిమిత్తం ద్విచక్ర వాహనంపై వాంకిడికి వచ్చి వెళ్తుండగా నవేధరి గ్రామ సమీపంలో ఎదురుగా వచ్చిన ట్రాక్టర్ ఢీకొట్టింది. తీవ్రగాయాలు కావడంతో రాజ్‌కుమార్ అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఆసిఫాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుని తండ్రి శంకర్ ఫిర్యాదు మేరకు ట్రాక్టర్ డ్రైవర్ కుమ్రె విజయ్‌పై కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై తెలిపారు.

అర్ధరాత్రి వరకు ఆందోళన

బాధిత కుటుంబానికి నష్ట పరిహారం చెల్లించాలని మృతుని బంధువులు, ఆదివాసీ సంఘాల నాయకులు మృతదేహంతో రహదారిపై ఆందోళన చేపట్టారు. దహన సంస్కారాలకు రూ. 50 వేలు, పరిహారం కింద రూ.3 లక్షలు ఇచ్చేందుకు ట్రాక్టర్ యాజమాని ఒప్పుకోవడంతో ఆందోళన విరమించారు.

రోడ్డు ప్రమాదంలో రాజస్థాన్ వాసి...

నేరడిగొండ: మండలంలోని కుప్టి జాతీయ రహదారిపై శనివారం తెల్లవారుజామున గుర్తు తెలియని వాహనం ఢీకొని ఒకరు మృతి చెందినట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు. రాజస్థాన్‌కు చెందిన దిలీప్ గుజర్ (20) కుప్టి వద్ద గల ధాబా హోటల్‌లో పనిచేస్తున్నాడు. హోటల్ యజమాని పని నిమిత్తం రాజస్థాన్‌కు వెళ్తున్న క్రమంలో అతన్ని బస్సు ఎక్కించి హోటల్‌కు వెళ్తుండగా రోడ్డు దాటుతున్న సమయంలో గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని బోథ్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం



సరస్వతీ కాలువలో గుర్తు తెలియని మృతదేహం

లక్ష్మణచాంద: మండలంలోని రాచాపూర్ శివారులోని సరస్వతి కాలువలో శనివారం గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఘటనాస్థలికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని బయటకు తీసి నిర్మల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుని వయస్సు 45 నుంచి 50 సంవత్సరాల మధ్య ఉంటుందన్నారు. రాచాపూర్ కారోబార్ రాజేందర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఏఎస్సై శ్రీనివాస్ వర్మ, ప్రొబేషనరీ ఎస్సై జుబేర్ తెలిపారు.

సిర్పూర్(టి): మండలంలోని టోంకిని గ్రామ సమీపంలో పెన్‌గంగ నదిలో శనివారం గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైనట్లు ఎస్సై కమలాకర్ తెలిపారు. స్థానికులు అందించిన సమాచారం మేరకు సంఘటన స్థలానికి వెళ్లి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ సామాజిక ఆస్పత్రికి తరలించినట్లు ఆయన పేర్కొన్నారు. మృతునికి సుమారు 50 ఏళ్లు ఉంటాయన్నారు.

హీరాసుకా జెండా తొలగింపుపై చర్చావేదిక

- తరలివచ్చిన ఉమ్మడి జిల్లా ఆదివాసీలు



చర్చావేదికలో పాల్గొన్న ఉమ్మడి జిల్లా ఆదివాసీలు

ఇంద్రవెల్లి: మండలంలోని కేస్లాపూర్ నాగోబా ఆలయ సమీపంలో ఏర్పాటు చేసిన పర్ధాన్ సమాజ్ కుల గురువు హీరాసుకా స్మారక జెండాను ఇటీవల గుర్తు తెలియని దుండగులు తొలగించారు. దీనిపై శనివారం కేస్లాపూర్ నాగోబా దర్బార్ హాల్‌లో నాగోబా ఆలయ పీఠాధిపతి మెస్రం వెంకట్‌రావ్ ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లాలోని నాలుగు సగల ఆదివాసీలతో చర్చావేదిక నిర్వహించారు. నాగోబా ప్రాంగణంలో హీరాసుక జెండాను ఏర్పాటు చేయడం సరికాదని, వేరేస్థలంలో ఏర్పాటు చేయాలని తీర్మాణించారు. ఆదిలాబాద్ ఎస్పీ అఖిల్ మహాజన్, ఉట్నూర్ ఏఎస్పీ కాజల్‌సింగ్ ఇంద్రవెల్లి పోలీస్ స్టేషన్‌ను సందర్శించి కేస్లాపూర్ నాగోబా దర్బార్ హాల్‌లో కొనసాగుతున్న ఆదివాసీల చర్చావేదికను ఉట్నూర్ సీఐ మొగిలి, ఎస్సై దుబ్బాక సునీల్ ద్వారా తెలుసుకున్నారు.

నూతన గనులు ఏర్పాటు చేయాలి



డైరెక్టర్‌ను సత్కరిస్తున్న ఐఎన్టీయూసీ నేతలు

శ్రీరాంపూర్: సింగరేణిలో నూతన గనులను ఏర్పాటు చేయాలని ఐఎన్టీయూసీ నేతలు శనివారం కంపెనీ డైరెక్టర్‌ను కోరారు. ఆర్జీవన్ ఏరియాలో పర్యటన నిమిత్తం వచ్చిన సింగరేణి డైరెక్టర్(పా) కొప్పుల వెంకటేశ్వర్లును ఐఎన్టీయూసీ సెక్రటరీ జనరల్, రాష్ట్ర కనీస వేతనాల సలహా మండలి చైర్మన్ బీ.జనక్‌ప్రసాద్ కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కంపెనీలో సుదీర్ఘకాలం ఒకేస్థానంలో పనిచేస్తున్న అధికారులను బదిలీ చేయాలన్నారు. ప్రస్తుతం పదేళ్లు దాటిన వారిని బదిలీ చేయాలని నిర్ణయం తీసుకున్నారని, దీన్ని ఐదేళ్లకు కుదించాలన్నారు. వేసవి తీవ్రత దృష్ట్యా ఉద్యోగుల రక్షణ, సంక్షేమంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. అధికారుల పనితీరును అంచనా వేసే విధంగా పర్ఫార్మెన్స్ ఇండికేటర్ విధానాన్ని అమల్లోకి తీసుకురావాలన్నారు. అనంతరం డైరెక్టర్‌ను సత్కరించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ కేంద్ర సీనియర్ ఉపాధ్యక్షులు నరసింహారెడ్డి, ధర్మపురి, కాంపల్లి సమ్మయ్య, ప్రధాన కార్యదర్శి లక్ష్మీపతిగౌడ్, ఆర్జీ 1 ఏరియా ఉపాధ్యక్షులు సదానందం, నాయకులు వడ్డేపల్లి దాస్, గడ్డం కృష్ణ, లింగమూర్తి, సాయి, సూర్యనారాయణ పాల్గొన్నారు.

బీజేపీ, కాంగ్రెస్ నాయకుల మధ్య వాగ్వాదం



మోదీ చిత్ర పటానికి క్షీరాభిషేకం చేస్తున్న బీజేపీ నాయకులు



ఘర్షణకు దిగుతున్న బీజేపీ, కాంగ్రెస్ నాయకులు

చెన్నూర్‌రూరల్: మండలంలోని కిష్టంపేటలో శనివారం రేషన్ బియ్యం పంపిణీ కార్యక్రమంలో బీజేపీ, కాంగ్రెస్ నాయకుల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. కేంద్రం నిధులతోనే సన్నబియ్యం పంపిణీ చేస్తున్నారని, అందుకు ప్రతీ రేషన్ షాపు వద్ద బీజేపీ నాయకులు ప్రధాని నరేంద్ర మోదీ చిత్రపటం ఏర్పాటు చేసి క్షీరాభిషేకం చేస్తున్నారు. ఈ క్రమంలో కాంగ్రెస్ నాయకులు మోదీ ఫ్లెక్సీని తొలగించడంతో ఇరుపార్టీల నాయకుల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని ఇరుపార్టీల నాయకులను శాంతింపజేశారు.

సింగరేణి విద్యాసంస్థల్లో నాణ్యమైన బోధన



మాట్లాడుతున్న జీఎం శ్రీనివాస్

శ్రీరాంపూర్: సింగరేణి విద్యాసంస్థల్లో నాణ్యమైన బోధన చేస్తున్నామని శ్రీరాంపూర్ ఏరియా జీఎం ఎం.శ్రీనివాస్ పేర్కొన్నారు. శనివారం సీసీసీలోని సింగరేణి హైస్కూల్‌లో పదోతరగతి పరీక్ష రాసిన విద్యార్థులకు గ్రాడ్యుయేషన్, కెరీర్ గైడెన్స్ ప్రోగ్రాం నిర్వహించారు. పూర్వ విద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి జీఎం ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. అనంతరం శిక్షణ పొందిన విద్యార్థులకు సర్టిఫికెట్లను అందించారు. ఈ కార్యక్రమంలో డీజీఎం (పర్సనల్) అరవిందరావు, పాఠశాల కరస్పాండెంట్ ఏ.రాజేశ్వర్, ప్రధానోపాధ్యాయులు సంతోష్, రిటైర్డ్ డైట్ కళాశాల ప్రిన్సిపాల్ ఇంద్రప్రకాష్‌రెడ్డి, పూర్వ విద్యార్థుల సంఘం సభ్యులు సమ్మయ్య, వాణిశ్రీ, రాజారెడ్డి, శ్యాంసుందర్‌రెడ్డి, కృష్ణవేణి, తదితరులు పాల్గొన్నారు.